మహనీయుల త్యాగఫలమే స్వేచ్ఛా వాయువులు

● మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: ఎందరో మహనీయుల ప్రాణత్యాగ ప్రతిఫలమే మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుతున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం హాలహర్వి మండలం అర్దగేరి గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను ఎన్నటికీ మరవరాదన్నారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులకు గుర్తుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ నెట్టె కంటమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనార్దన్‌నాయుడు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, వైస్ ఎంపీపీ నాగేష్, సర్పంచ్ గురుదాస్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటుతూ..

తుగ్గలి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామాల్లో 'నా మట్టి–నా దేశం' కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రామలింగాయపల్లి, పగిడిరాయి, ఉప్పర్లపల్లి, మీటేతండా, సూర్యతండాల పాఠశాలల వద్ద స్వాతంత్ర్య సమరయోధులకు గుర్తుగా శిలాఫలకాలను ఏర్పాటు చేసి విద్యార్థులతో కలిసి పలువురు ప్రతిజ్ఞ చేశారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకుని మొక్కలు నాటారు. సర్పంచ్ ప్రభాకరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రామదాసు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అర్దగేరి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మొక్కనునాటి నీరు పోసిన మంత్రి గుమ్మనూరు జయరాం

కొనసాగుతున్న 'నా మట్టి – నా దేశం'

వెల్దుర్తి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నా మట్టి– నాదేశం,నేల తల్లికివందనం – వీరులకు వందనం' కార్యక్రమం గ్రామాల్లో కొనసాగుతోంది. శనివారం ఏపీఓ రాజునాయక్ ఆధ్వర్యంలో గోవర్ధనగిరి, ఎల్ నగరం, బింగిదొడ్డి, సూదేపల్లె గ్రామాల్లో దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులకు అంకితమిస్తూ పలుకార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. శిలాఫలకాలు ఆవిష్కరించారు.పంచప్రాణాల ప్రతిజ్ఞ చేశారు. ఆ యా కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూదేపల్లె వెంకటేశ్వరరెడ్డి,ఎల్ నగరం రంగడు, గోవర్ధనగిరి కేశవ్, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

ఆస్పరి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆస్పరిలోని నారాయణ స్కూల్ విద్యార్థులు 150 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు విద్యార్థులు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం నరేష్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహనీయులను స్మరించుకోవాలి

హొళగుంద: దేశం కోసం పోరాడిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సీడీ సీఎల్‌ఆర్‌సీ సురేశ్‌బాబు అన్నారు. శనివారం హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆజాదిక అమృత మహోత్సవంలో భాగంగా నా భూమి– నా దేశం, నేల తల్లికి సమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసిన మహనీయులను స్మరించుకున్నారు. రిటైర్డు జవాను నాగరాజును సన్మానించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఏపీఓ భక్త వత్సలం, హెచ్‌ఎం నజీర్ అహమ్మద్, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ పాల్గొన్నారు.



రామలింగాయపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



గోవర్ధనగిరిలో మొక్క నాటుతున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు



ఆస్పరిలో జాతీయ జెండాతో విద్యార్థులు



హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో రిటైర్డు జవానును సన్మానిస్తున్న దృశ్యం

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి జయరాం

ఆలూరు: అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. హాలహర్వి మండలం అర్దగేరి గ్రామంలో సర్పంచ్ గురుదాస్ రెడ్డితో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం, ఎస్సీ కాలనీ రహదారి పనులను ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారాన్ని వివరించి బుక్‌లెట్ అందజేశారు. అంతకుముందు వాల్మీకి, అంబేడ్కర్ విగ్రహాలకు పూల, మాలలు వేసి ఘనంగా నివాళ్లులర్పించారు.

మంత్రికి కృతజ్ఞతలు

దేవనకొండ మండలం బి.సెంటర్‌కు చెందిన ముస్లింలకు శ్మశానవాటిక కోసం 1.75 సెంట్లు స్థలంలో మంత్రి గుమ్మనూరు జయరాం మంజూరు చేసినందకు ప్రత్యేకంగా ఆగ్రామ ముస్లీం సోదరులు గ్రామ సర్పంచ్ బాగ్యమ్మ, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు దివాకర్‌నాయుడు, రహంతుల్లా, మహబూబ్‌బాషా తదితరులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపాశారు. శ్మశానవాటిక స్థలానికి ప్రహరీకి, పైపులకు నిధులు మంజూరు చేస్తానని వారికి మంత్రి హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

సమాజంలో ధార్మిక నిష్ట పెరగాలి



స్వామివారికి పూజ చేస్తున్న అర్చకులు

ఎమ్మిగనూరుటౌన్: సమాజంలో ధార్మిక నిష్ట పెరగాలని తద్వారా శాంతి సుస్థిరతలు నెలకొంటాయని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక తిరుమల నగర్‌లో శనివారం శ్రీవెంకటసాయి మందిరంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారిని సహస్ర కమలాలతో అలంకరించి సహస్ర నామార్చన చేశారు. గోపూజ, కుంకుమార్చనలతో పూజా కార్యక్రమాలు చేసి ధర్మప్రచారంపై ప్రసంగించారు. కార్యక్రమంలో అర్చకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద భక్తులు

ఆలూరు రూరల్: పట్టణంలోని కర్నూలు–బళ్లారి హైవే 167లో నిర్మిస్తున్న నూతన ఆంజనేయ స్వామి విగ్రహానికి అర్చకులు రవిశాస్త్రి, యుగంధర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రూ.80 లక్షలతో 54 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహానికి భూమి పూజ చేసి నేటికి ఏడాది పూర్తయ్యిందన్నారు. విగ్రహ నిర్మాణం 70 శాతం పూర్తయిందన్నారు.

ప్రత్యేక పూజలు





పూజలందుకున్న హనుమన్నస్వామి, కూర్మ నారాయణస్వామి

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలో వెలసిన కూర్మ నారాయణస్వామి, హనుమన్న స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో స్వాములకు గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వాములను భక్తులు దర్శించుకున్నారు.

గద్దర్‌కు నివాళి



చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎన్జీఓ కార్యాలయ ఆవరణలో ప్రజా యుద్ధనౌక, ప్రజాగాయకుడు గద్దర్ చిత్రపటానికి శనివారం పలువురు నివాళులర్పించారు. ఆయన మరణం పేదలకు తీరని లోటు అని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, ఏఐఎఫ్‌టీయూ, బీసీ సంఘ నాయకులు సంజీవ్, బతకన్న, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టి విద్యార్థి సమాఖ్య నాయకులు శేఖర్, ఉదయ్, కృష్ణ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మద్దికెర: వైఎస్సార్ క్రాంతిపథం ఉద్యోగులకు 23 శాతం వేతనాలు పెంచినందుకు, పొదుపు మహిళలకు సున్నా వడ్డీ పథకంలో నాలుగో విడత నిధులు మంజూరు చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ జీతాలు పెంచాలని ఎన్నో ఏళ్లగా కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. జగనన్న పెంచడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మంత్రి స్వంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

హొళగుంద: మంత్రి గుమ్మనూరు జయరాం స్వంత నిధులతో మార్లమడికి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్నట్లు ఆయన సోదరుడు, దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు తెలిపారు. గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన మార్లమడికి రోడ్డు మరమ్మతు పనులను శనివారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. 5 కి.మీ ఈ రోడ్డు డబుల్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా కార్యరూపం దాల్చడంలో ఆలస్యమైందన్నారు. మరో పక్క రోడ్డు అధ్వానంగా ఉండటంతో కర్ణాటక ఆర్టీసీ వారు బస్సు సర్వీసులను నిలిపేశారన్నారు. దీంతో మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని మంత్రి గుమ్మనూరు జయరాం తన స్వంత ఖర్చుతో మరమ్మతులు చేయించేందుకు ఉపక్రమించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేసి పనులు ప్రారంభిస్తున్న దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు



స్టేడియం ఏర్పాటుకు వినతి

హొళగుంద: మండలంలో ఇండోర్ స్టేడియం మంజూరుకు చర్యలు తీసుకోవాలని శనివారం హొళగుంద మండలానికి చెందిన యువకులు ఎల్లార్తి అర్జున్, తిక్కస్వామి, మహేశ్, రమేశ్ తదితరులు ఏపీ షాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డిని కలిసి విన్నవించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నందవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం పోలీస్ స్టేషన్స్ సెంట్రల్ టీం పరిశీలకులు సందర్శించారు. ఈ స్టేషన్ ఉత్తమ స్టేషన్‌గా ఎంపిక కావడంతో ఇక్కడ ప్రజలకు అందుతున్న సేవలు, తదితర వివరాలను సేకరించినట్లు సమాచారం. ఆయనతోపాటు సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ తిమ్మయ్య ఉన్నారు.



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న సెంట్రల్ టీమ్ అధికారి లోకేశ్వర్‌రెడ్డి

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

● పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఆలంకొండలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: ఎన్నికల హామీలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రజలను కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ ఆర్‌పీ వెంకటరాముడుతో కలిసి శనివారం ఆమె ఆలంకొండలో ఇంటింటికీ వెళ్లి పాలనపై ఆరా తీశారు. నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. అనంతరం విశ్వేశ్వరస్వామి, సుంకులమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని పథకాలను జగనన్న నాలుగేళ్లలో అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కాగా సీసీ రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు ప్రజలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, సింగిల్‌విండో అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, పార్టీ యూత్ కన్వీనర్ లక్ష్మికాంతరెడ్డి, గ్రామ నాయకులు ధనుంజయ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుంకిరెడ్డి, సుదర్శనాచారి, మల్లికార్జున, అశోక్‌కుమార్, బిల్లా వెంకటేష్, సురేంద్ర పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మద్దికెర: నిరుద్యోగ యువతీయువకులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం, డీఆర్‌డీఏ సీడాప్ ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలకు సంబంధించి డిగ్రీ, బీఎస్సీ, బీజెడ్సీ, కెమిస్ట్రీ చదివి ఖాళీగా ఉన్న 19 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు వారికి అపోలో ఫార్మసీ వారు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలో రిటైల్ సేల్స్ సూపర్ వైజర్‌కోర్స్, పేషంట్ రిలేషన్ అసోసియేట్ కోర్సులలో నాలుగు నెలలపాటు శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు జాబ్స్ కోఆర్డినేటర్ ఖాజా బాషా 6300373877 సంప్రదించాలన్నారు.

తండ్రిపై కుమారుల దాడి

కృష్ణగిరి: బాపనదొడ్డి గ్రామానికి చెందిన మహేశ్వర రెడ్డి, కాంతారెడ్డి, వెంకటేశ్వరమ్మలపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన వీరారెడ్డిపై ఈనెల 10న తన చిన్న భార్య ఇంటిలో ఉండగా కుమారులు, మొదటి భార్య కట్టెలతో దాడి చేసి గాయపరిచారన్నారు. మొదటి భార్య ఇంటి ముందు తిరుగుతున్నాడని, మా ఇంటి ముందు తిరిగితే నీ అంతు చూస్తామని బెదించడం జరిగిందన్నారు. బాధితుడు వీరారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ పతాకాన్ని సమాఖ్య జాతీయ కార్యదర్శి రంగన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు విజయేంద్ర, రంగస్వామి, సమీవుల్లా పాల్గొన్నారు.

గోనెగండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏఐఎస్‌ఎఫ్ జెండాను సంఘం తాలూకా అధ్యక్షుడు మునిస్వామి, సీనియర్ నాయకులు గానిగ బాషా, రంగస్వామి, సుధాకర్ తదితరులు ఆవిష్కరించారు.

నందవరం: స్థానిక పాత ఇంటిగ్రేటెడ్ వసతి గృహం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫెడరేషన్ మాజీ నాయకులు భీమన్న జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: స్థానిక బాలుర జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాఖ్య రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు టి కృష్ణ జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో మండల ప్రతినిధులు సుధీర్ నాయుడు, శాంతకుమార్, చరణ్, అడవిరాముడు, సీపీఐ నాయకులు డి రాజు, బాలరాజు పాల్గొన్నారు.


హొళగుంద: ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సభ్యుడు పెద్యాట శ్రీరంగ సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శులు పెద్యాట మారెప్ప, సతీష్‌కుమార్, మల్లి, గణేష్, నాగరాజు పాల్గొన్నారు.



ఏఐఎస్‌ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ జాతీయ కార్యదర్శి రంగన్న

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మిగనూరుటౌన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పట్టణ ఎస్‌ఐ మస్తాన్‌వలి, ఆర్‌డీటీ రీజినల్ డైరెక్టర్ రామస్వామి అన్నారు. శనివారం బాలుర ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఆర్‌డీటీ ఆధ్వర్యంలో బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వేదాస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్‌కుమార్, ఆర్‌డీటీ ఏటీఎల్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

పంటలకు ముందస్తు 'మద్దతు'

● పత్తికి క్వింటాల్ రూ.7,020, వరికి రూ.2,203
● వేరుశనగకు రూ.6,377, కందులు రూ.7,000
● గతేడాదికంటే పెరిగిన మద్దతు ధరలు

ఎమ్మిగనూరు: వ్యవసాయానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. నా అంత సీనియర్ లేరని చెప్పుకునే చంద్రబాబు సైతం వ్యవసాయం దండగా అన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం రైతన్నలకు వెన్నుదన్నుగా నిలిచి వ్యవసాయాన్ని పండగలా మార్చారు. అన్నదాతకు ఏ అవసరమొచ్చినా పరిష్కరించేలా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా మందులు, ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. పెట్టుబడి కోసం ఆర్థిక సాయం అందిస్తున్నారు. మరో అడుగు ముందుకేసి రైతులు పండించే దిగుబడులకు ముందస్తు మద్దతు ధర ప్రకటించారు. దీనివల్ల ఏ పంట సాగు చేస్తే గిట్టుబాటు అవుతుందో రైతులకు అవగాహన ఉంటుంది. పంటల వారిగా పెడుతున్న పెట్టుబడులు, వస్తున్న దిగుబడులు, మార్కెట్లో పలుకుతున్న ధరలు, రైతులకు వస్తున్న నికరలాభాలను లెక్కించి జగన్ సర్కార్ నాలుగేళ్లుగా ముందస్తు మద్దతు ధరలు ప్రకటిస్తోంది. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో మద్దతు ధర ప్రకటించేవారు. ఈ సారి మద్దతు ధరలు పెంచి జూన్‌లోనే ప్రకటించటంతో అన్నదాతల్లో ఆనందం వెల్లవిరుస్తోంది.



తుంగాతీరంలో మొక్కజొన్న సాగు

15 పంటలకు 'మద్దతు'

ఈ యేడాది ఖరీఫ్‌లో సాగుచేసే 15 పంటలకు ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించింది. జిల్లాలో వేరుశనగ, పత్తి, వరి, కందులు ప్రధాన పంటలు. వేరుశనగ పంటపై గత యేడాది కంటే క్వింటాల్‌పై రూ.527 పెంచారు. పత్తిపంటకు రూ.540, కందులుకు రూ.400, మొక్కజొన్నకు రూ.128, వరికి రూ.143 పెంచారు. అత్యధికంగా నువ్వులపై రూ.805, పెసలుపై రూ.803 ప్రకారం పెంచారు. సజ్జలు, రాగులు, జొన్నలపై కూడా రూ.150 నుంచి రూ.250 వరకు పెంచారు.

మద్దతు ధరలు లేకపోతే ప్రభుత్వమే కొనుగోళ్లు

రైతులు సాగుచేసిన పంటలు కోతకొచ్చే సమయంలో బయటి మార్కెట్లో మద్దతుధర (ఎంఎస్పీ)కంటే తక్కువకు పంట దిగుబడులు అమ్ముడుపోతుంటే ప్రభుత్వమే మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేస్తోంది. వరి, వేరుశనగ, కంది, పప్పుశనగ, మొక్కజొన్న, కొర్రలు, రాగులు, సజ్జలు, పత్తి పంటలను ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసేలా ప్రభుత్వం యేటా ఉత్తర్వులిస్తోంది. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల సహకారంతో పౌరసరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఏపీ సీడ్స్, ఆయిల్‌ఫెడ్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ల ద్వారా ప్రభుత్వమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అయ్యేలా చేస్తోంది.

పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు(క్వింటాల్‌కు)

పంట	2022లో	2023లో	పెరిగింది రూ.
పత్తి	6,380	7,020	640
వరి	2,060	2,203	143
వేరుశనగ	5,850	6,377	527
కందులు	6,600	7,000	400
మొక్కజొన్న	1,962	2,090	128
జొన్న(ఎం)	2,990	3,225	235
జొన్న(హెచ్)	2,970	3,180	210
సజ్జలు	2,350	2,500	150
రాగులు	3,578	3,846	268
పెసలు	7,755	8,558	803
మినుములు	6,600	6,950	350
నువ్వులు	7,830	8,635	805
ఒడిసెలు	7,257	7,734	447
సన్‌ఫ్లవర్	6,400	6,760	360
సోయాబీన్	4,300	4.600	300

ప్రభుత్వమే కొనుగోలు చేసింది



మొక్కజొన్న పంటకు ఈ యేడాది గిట్టుబాటు ధరలు లేకపోవటంతో ప్రభుత్వమే క్వింటాల్ రూ.1,962 చొప్పున కొనుగోలు చేసింది. 475 సంచుల దిగుబడి వచ్చింది. ప్రభుత్వమే కొనుగోలు చేసి పదిరోజుల్లో నా అకౌంట్‌లో జమ చేసింది. బయట వ్యాపారులు క్వింటాల్ రూ.1,750 కొనుగోలు చేస్తే ప్రభుత్వం రూ.210 ఎక్కువకు కొనుగోలు చేసి మాలాంటి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చింది. – పి.బందెనవాజ్, మొక్కజొన్నరైతు, ముగతి

కోలుకోలేక రైతు మృతి

ఆస్పరి: అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రైతు కోలుకోలేక శనివారం మృతిచెందాడు. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు.. మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న (46) తన మూడు ఎకరాలతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. మూడేళ్ల నుంచి పంటలు సరిగా పండక పెట్టుబడుల కోసం బ్యాంకు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.8 లక్షలు దాకా అప్పు చేశాడు. వాటిని తీర్చేదారి లేక ఈనెల 9న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ కోలుకోలేక తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంపీటీసీ సభ్యుడి మృతి



రంగన్న (ఫైల్)

దేవనకొండ: మండలంలోని చెల్లెలచెలిమల ఎంపీటీసీ సభ్యుడు బేతపల్లె పాడే రంగన్న(65) శనివారం మృతిచెందారు. రంగన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారు. కోలుకోలేక మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రంగన్న మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పశువులకు టీకాలు

నందవరం: గంగవరం, జొహరాపురం, చిన్నకొత్తిలి గ్రామాల్లో ఆవులు, ఎద్దులకు పశువైద్యుడు నరేంద్రనాథ్‌రెడ్డి శనివారం లంపీ స్కిన్(చర్మవ్యాపు వ్యాధి) నివారణ టీకాలు వేశారు. గత ఏడాదిలో ఈ వ్యాధితో బాధపడ్డాయని, ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.